క్లుప్తంగా

ఘనంగా సాహు మహారాజ్ జయంతి



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావునగర్‌లోని బీసీ ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం మహర్షి ఛత్రపతి సాహు మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎన్వీ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో తొలుత సాహు మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సాహు మహారాజ్ గురించి బీసీ నేతలు వివరించారు. బలహీన వర్గాలకు రిజర్వేషన్, బాలికలకు హాస్టల్స్, విద్యాసంస్థలను స్థాపించడమే కాకుండా విద్యాభివృద్ధి కోసం సాహూ మహారాజ్ చేసిన కృషిని గుర్తు చేశారు. సాహు మహారాజ్ ఆశయ సాధనకు మనందరం కట్టుబడి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగ సంఘ నాయకులు ఎంవీఎస్ఎన్ మూర్తి, సంఘ ప్రధానకార్యదర్శి నమ్మి అప్పారావు, బాయన శేఖర్‌బాబు, వేముల వెంకట్రావు, బాబూరావు, మల్లేశ్వరి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ




చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లోవేం చేసిన నగరాల సీతారామస్వామి, మహాలక్ష్మీ అమ్మవార్ల దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు గురువారం సారెను సమర్పించారు. అమ్మవారి ఆలయ కల్యాణ మండపం నుంచి సారె సామగ్రితో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి ఊరేగింపులో పాల్గొన్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాలతో పెద్ద ఎత్తున ముత్తయిదువులు, భక్తులు పట్టుచీర, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, పూజా సామగ్రితో ఊరేగింపుగా దుర్గగుడికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మహా మండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, మరుపిళ్ల సత్యానారాయణ, కామందుల నరసింహరావు, పిళ్లా విజయ్‌కుమార్, తమ్మిన సూర్యకుమారి, పణుకు రమా, దేవస్థాన సిబ్బంది శ్రీనివాసరావు, దేవి తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే సుజనా



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి కుటుంబ సమేతంగా గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరిని ఆలయ ఈవో శీనానాయక్ సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ ఈవో శీనానాయక్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీ అభినయ కూచిపూడి అకాడమీకి చెందిన కళాకారులు గురువారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్యాచారిణి ఊర్వశి సతీష్ పర్యవేక్షణలో 20 మంది కళాకారులు పలు కీర్తనలకు లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు నృత్య ప్రదర్శనను వీక్షించి కళాకారులను అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం కళాకారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.

49 మందికి జరిమానా

విజయవాడలీగల్: నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 49 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. విజయవాడ నగర పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 49 మందిపై ఐదో ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదుచేశారు. 49 మందిని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 10 మందికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున, మిగిలిన 39 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

వర్షపు నీరు వెళ్లే మార్గమేది?

- కొద్దిపాటి వర్షానికి చిత్తడిగా రహదారులు
- మార్జిన్లలో నీరు నిలిచి దెబ్బతింటున్న వైనం
- వాహనదారులకు అవస్థలు



భవానీపురం పోలీసు స్టేషన్ ఎదురు రోడ్డులో తటాకంలా మారిన రోడ్డు, బురదకయ్యగా మారిన దృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం బైపాస్ రోడ్డు మార్జిన్ అక్కడక్కడ తటాకాలను తలపిస్తోంది. రోడ్డు మార్జిన్‌లో భారీగా వర్షపు నీరు నిలుస్తోంది. కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఈ రోడ్డు సితార నుంచి భవానీపురం పోలీసు స్టేషన్ ఒక్కో చోట ఒక్కో తీరుగా ఉంటుంది. ఒక చోట రోడ్డు మార్జిన్ ఒక వైపు ఎత్తుగా ఉంటే మరోవైపు పల్లంగా ఉంటుంది. ఐరన్ యార్డు సమీపంలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద దుకాణాలు ఉన్నాయి. నిత్యం వందలాది లారీలు భారీ లోడుతో ఐరన్‌యార్డుకు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం పడినపుడు పల్లంగా ఉన్న చోట భారీగా నీరు నిలిచి ఉంటుంది. మార్జిన్‌లోనే కాకుండా రోడ్డు సగానికి వర్షపు నీరు చేరుతోంది. ఎటూ వెళ్లే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నిలిచి ఇబ్బందికరంగా మారింది. వాహనాల రాకపోకలతో బురద కయ్యగా తయారైంది. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డులో వెనుక నుంచి వాహనాలు వస్తుంటే బురద నీరు కారణంగా పక్కకు తప్పుకోవడానికి వాహనదారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఐరన్ యార్డులోకి వెళ్లే వాహనాలు , ఆటోలు, ఆకతాయిల బైక్‌లు వేగంగా వెళితే బురద నీరు చింది దుస్తులపై. ఒంటిపై పడి ఇబ్బందులు పడుతున్నారు. యార్డులో పనులకు వెళ్లే వారు నడిచి వెళ్లే పరిస్థితి లేదు. వర్షపు నీరు, బురద కారణంగా రోడ్డు మధ్యలో నడవాల్సిన పరిస్థితి. దీంతో ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని కూలీలు భయాందోళన చెందుతున్నారు. ఆ రోడ్డులో రెండు చోట్ల స్కూల్స్ ఉండడంతో ఉదయం, సాయంత్రం వాహనాలపై పిల్లలను స్కూల్స్‌లో దించేందుకు వెళ్లే వారు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. రోడ్డుకు ఒకవైపు వర్షపు నీరు నిలుస్తుంటే, మరో వైపు భారీ వాహనాలు అడ్డగోలుగా పార్క్ చేస్తున్నారు. ఒకవైపు రోడ్డు సగం వరకు నీటి మడుగులు, మరో వైపు సగానికి వాహనాలు నిలిపి ఉంచడంతో ప్రమాదకరంగా తయారైంది.

దెబ్బతింటున్న తారు రోడ్డు....

వర్షపు నీరు రోడ్డు మధ్య వరకు నిలిచి ఉండడం. ఆ నీటిలో భారీ వాహనాలు తిరుగుతుండటంతో తారు దెబ్బతింటుంది. రోడ్డు కుంగి గుంతలు ఏర్పడుతున్నాయి. చిన్నపాటి వర్షానికి తటాకాలు మారడం, రోజుల తరబడి నిలిచి ఉండడం కారణంగా దెబ్బతింటోంది. భారీగా గుంతలు ఏర్పడి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది అప్పుడప్పుడు నీటిని తోడివేస్తున్నారు. కానీ ఉదయమో, సాయంత్రమో వర్షం కురుస్తుండడంతో ఆ వెంటనే నీరు నిలిచిపోతోంది. తాత్కాలికంగా నీటిని తోడి వేయడంతోనే సరిపెడుతున్నారు.



దీనికి శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు. మార్జిన్లు సరిచేసి వర్షం పడినపుడు నీరు వెంటనే పక్కకు వెళ్లి డ్రైయిన్‌లో కలిసేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై టీడీపీ నాయకుడి దాడి

- రాజీ చేసిన పోలీసులపై ఉద్యోగుల ఆగ్రహం
- విధుల్లో ఉన్న పోలీస్‌ను కొడితే ఊరుకుంటారా అంటూ మండిపాటు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విధుల్లో ఉన్న ఒక ప్రభుత్వ ఉద్యోగిపై తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.... భవానీపురం 41వ డివిజన్ అధ్యక్షుడిగా సూదాబత్తుల సంతోష్ కుమార్ ఇటీవల నియమితుడయ్యాడు. అలాగే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) డైరెక్టర్‌గా కూడా నామినేట్ చేయబడి ఈ నెల 27న ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భాన్ని పురస్కరించుకుని విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల్లో ఫ్లెక్సీలు కట్టించాడు. ఈ క్రమంలో పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కట్టించిన ఫ్లెక్సీలను స్థానిక సచివాలయం ప్లానింగ్ సెక్రటరీ సుగుణ తేజ, సిబ్బంది బుధవారం తొలగిస్తున్నారు. విషయం తెలిసిన సంతోష్ కుమార్ కొందరు స్నేహితులతో అక్కడకి వచ్చి ఫ్లెక్సీలను తొలగిస్తున్నవారితో ఘర్షణకు దిగాడు. రెండు రోజుల్లో ప్రమాణ స్వీకారం చేయనుండగా అప్పుడే ఎలా తొలగిస్తారంటూ సుగుణ తేజ, సిబ్బందిపై దాడికి తెగబడి కొట్టారు. జరిగిన విషయాన్ని ఉన్నత అధికారులకు ఫోన్‌లో తెలియ చేస్తున్న సుగుణ తేజపై సంతోష్ కుమార్ అండ్ గ్యాంగ్ మరోమారు దాడి చేయడంతో అతను కిందపడిపోయారు. దీనిపై ఆగ్రహం చెందిన భవానీపురం, విద్యాధరపురం సచివాలయ ఉద్యోగులు సుగుణ తేజతో కలిసి భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు ఇరు వర్గాలను కూర్చోబెట్టి రాజీ చేయడం విమర్శలకు దారి తీస్తుంది. కొట్టింది అధికార పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టి పోలీసులు ఒత్తిడికి తలొగ్గి సంతోష్ కుమార్‌తో సచివాలయ ఉద్యోగి సుగుణ తేజకు క్షమాపణ చెప్పించి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేయడంపై సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేసి కొట్టినవారిపట్ల పోలీసులు ఉదాసీన వైఖరి అవలంభించటం ఏమిటని సచివాలయ ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. అదే విధుల్లో ఉన్న పోలీస్‌పై ఎవరైనా దాడి చేస్తే ఊరుకుంటారా అంటూ మండిపడుతున్నారు. అధికార పార్టీకి చెందినవారికి ఒక న్యాయం, ప్రభుత్వ ఉద్యోగులు, సామాన్యులకు ఒక న్యాయమా అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న భవన నిర్మాణ కార్మికులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించి, సంక్షేమ బోర్డు పునరుద్ధరించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎ. వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాల సమీపంలో భవన నిర్మాణ కార్మికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరుతూ జూలై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సీఐటీయూ నగర కార్యదర్శి ఎం. బాబూరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి. గోవిందు మాట్లాడారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షుడు జి. కృష్ణ, కమిటీ సభ్యులు జి. రామకృష్ణ, హరిబాబు, రాంబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వారాహి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



వారాహి అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారాహి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ అందాలని, ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వారాహీ నవరాత్రి పూజలు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం 7.30 గంటలకు విశేషంగా లలితా సహస్రనామ పారాయణం, ప్రత్యేక అర్చనలు, పూజలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

లయన్స్ స్మైల్స్ క్లబ్‌కు నూతన అధ్యక్ష, కార్యదర్శులు



నూతన అధ్యక్ష, కార్యదర్శులతో సీనియర్ ప్రతినిధులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వై.బాబూరావు, నందం దుర్గాప్రసాద్ ఎన్నికయినట్లు క్లబ్ కోశాధికారి వేముల వెంకట్రావు తెలిపారు. చిట్టినగర్‌లోని శ్రీగౌతమ్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కోశాధికారి పోతిన పవన్‌లను శాలువాతో సత్కరించారు. క్లబ్ గతంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకుంటామని తెలిపారు. క్లబ్ సీనియర్ ప్రతినిధులు ఎన్వీ రావు, నల్లాని సూర్యారావు, శివకుమార్ పట్నాయక్, ఏడుకొండలు, బాయన శేఖర్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ కిట్స్ అందజేత



విద్యార్థులకు కిట్స్ అందజేస్తున్న కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం 40వ డివిజన్ ఆకుల రాజేశ్వరరావు మిల్ రోడ్ లోని ఎస్‌కేఎస్ఆర్ఎం ఎలిమెంటరీ మున్సిపల్ స్కూల్ విద్యార్థులకు 2025–2026 విద్యా సంవత్సరానికి గురువారం స్టూడెంట్స్ కిట్ పంపిణీ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయరెడ్డి పాల్గొని విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూర్య, ఉపాధ్యాయులు సీత, వైదేహీ, సంధ్యా, నూర్జహాన్, నాయకులు రమణారెడ్డి , శివరామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

•నగరంలో జోరువాన



విజయవాడలో గురువారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంది. సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. రాత్రి 7.30 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



దుర్గాఘాట్‌లో హాకర్ల నియంత్రణకు చర్యలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గాఘాట్‌లో హాకర్లు, చిరు వ్యాపారుల నియంత్రణకు ఆలయ అధికారులు చర్యలు ప్రారంభించారు. దుర్గాఘాట్‌లో హాకర్లు, చిరు వ్యాపారులకు కేటాయించిన స్థలాలను గురువారం ఆలయ అధికారులు కొలతలు వేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పర్యవేక్షణలో ఇంజనీరింగ్, లీజెస్ అధికారులు దుర్గాఘాట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఘాట్‌లో ఎంత మంది వ్యాపారులు ఉన్నారు...ఎంత మందికి పర్మిషన్ ఉంది. ఎంత మంది అద్దెలు చెల్లిస్తున్నారనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనేకమంది వ్యాపారులు అద్దె బకాయిలు ఉన్నట్లు గుర్తించి, నెలాఖరు నాటికి చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. జులై 1వ తేదీ నాటికి అద్దె బకాయిలు చెల్లించిన వారికి మాత్రమే అమ్మకాలు జరుపుకునేందుకు అనుమతి ఇస్తామని ఆలయ అధికారులు స్పష్టం చేశారు.

రేపు పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్లాది విష్ణు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు బీఆర్టీఎస్ రోడ్డు, రామకోటి దేవాలయం సమీపంలో ఆయన విగ్రహావిష్కరణ జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే, మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లాది విష్ణు తెలిపారు. విగ్రహావిష్కరణ ఏర్పాట్లను గురువారం స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తితో కలిసి మల్లాది విష్ణు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానిగా, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా, యావత్ భారత దేశం గర్వించదగిన నేతగా పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు చిరస్మరణీమని కొనియాడారు. మల్లాది వెంకట సుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేసుకోవడం గర్వ కారణమన్నారు. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి, పలువురు మాజీ శాసన సభ్యులు, నగర మేయర్, కార్పొరేటర్లు, అధికారులు, పలు సామాజిక వర్గాలకు చెందిన నాయకులు, మేధావులు, ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు దోనేపూడి శ్రీనివాసరావు, చల్లా సుధాకర్, రామకృష్ణ, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు బలరామ్ పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల పరిశీలన



విజయవాడరూరల్: ఖమ్మం–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అధికారులను ఆదేశించారు. ఖమ్మం – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి ఎన్‌హెచ్ – 165జీ విస్తరణ పనుల్లో భాగంగా గురువారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా రెవెన్యూ అధికారులతో కలిసి రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి గ్రామాల్లో సేకరించిన ప్రభుత్వ భూములను పరిశీలించారు. పర్యటనలో విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీ కొని ఇద్దరు మహిళలకు గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళలను లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు గాయపడ్డారు. ఈ ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కండ్రికకు చెందిన దాసరి సుగుణ సున్నిలో ఇంటి పనులు చేస్తూ జీవిస్తోంది. సుగుణ తన తల్లితో కలిసి పనులు ముగించుకుని బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి బయలుదేరింది. రాత్రి 11.30 గంటల ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోని జంక్షన్ వద్ద యూటర్న్ తీసుకుని వెళుతుండగా రామవరప్పాడు వైపు నుంచి వేగంగా వస్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన సుగుణ, ఆమె తల్లిని ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు సుగుణ ఫిర్యాదు మేరకు గురువారం గుణదల పోలీసులు కేసు నమోదు చేశారు.

'డీజీ లక్ష్మి'లకు సాంకేతికతపై ఆన్‌లైన్‌లో శిక్షణ

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ –3 పరిధిలో డిజి లక్ష్మిలో నమోదైన పొదుపు సంఘాల సభ్యులకు గురువారం మెప్మా ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. వీఎంసీ పట్టణ సాధికార విభాగం ప్రాజెక్ట్ అధికారి పి. వెంకట నారాయణ మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో జరిగే శిక్షణలో డిజీ లక్ష్మి విధి విధానాలు, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలి, ఏవిధంగా డిజి లక్ష్మి కార్యక్రమాలు నిర్వహించాలి తదితర అంశాలను వివరించారు. స్వయం సహాయక బృందాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇదొక మంచి అవకాశమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సాంకేతికతపై అవగాహన పెరగడమే కాకుండా ఆర్థిక అభివృద్ధి కూడా జరుగుతుందని చెప్పారు. విజయవాడ నగర పాలక సంస్థ, యూసీడీ విభాగం సీడీఓలు, టెక్నికల్ అసిస్టెంట్, సీఓలు, సోషల్ వర్కర్లు, సీఎల్ఆర్పీలు పాల్గొన్నారు.

సంగీత సద్గురువులకు స్వర నీరాజనం



వీణ వాద్య కచేరి చేస్తున్న ఎస్. నాగలక్ష్మి, పద్మ

విజయవాడ కల్చరల్: సంగీత సద్గురువులు సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రి 108, గాయక సార్వభౌమ పారుపల్లి రామకృష్ణయ్య పంతులు 74 వర్ధంతి సందర్భంగా శిష్యప్రశిష్యుల ఆధ్వర్యంలో దుర్గాపురం రామకోటిలోని భారతీ తీర్థ మహాస్వామి శ్రవణ సదనంలో సంగీత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమాను ప్రారంభించిన కార్యక్రమ కన్వీనర్ మోదుమూడి సుధాకర్ మాట్లాడారు. కొత్తూరు శ్రీరంజని, బీవీఎస్ శ్రీ కృష్ణ, సింహపురి సోదరీమణులు ఎస్. నాగలక్ష్మి, ఆర్. పద్మాచక్రవర్తి వీణ, బీవీ విద్యాసాగర్, పి. నందకుమార్‌లు వయోలిన్ సోలో, త్యాగరాజ స్వామి కృతులను ఆలపించారు. పి. జయతి, మహతి, హేమాద్రి చంద్రకాంత్, వై. గణేష్, కె. జగన్మోహిని వాద్య సహకారం అందించారు.

జార్ఖండ్ యువకుడికి అరుదైన సర్జరీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): జార్ఖండ్‌లోని రాంచీకి చెందిన 33 ఏళ్ల యువకుడికి నగర వైద్యులు క్లిష్టమైన మైక్రో వాస్క్యులర్ ఏఎల్‌టీ ఫ్రీ ఫ్లాప్ – ఇలిజారోవ్ రింగ్ ఫిక్సేటర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ హాస్పటల్‌కు చెందిన చీఫ్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ప్రతాప్ దుగ్గిరాల కేసు వివరాలు వెల్లడించారు. రాంచీకి చెందిన యువకుడు విశాఖపట్నంలో పనిచేస్తుండగా ఎడమకాలి కింది భాగంలో తీవ్రంగా గాయమైంది. అక్కడ ఓ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసిన తర్వాత గాయం తీవ్రత ఎక్కువ కావడంతో కాలును తొలగించాలని చెప్పారు. దీంతో విజయవాడలోని ప్రతాప్ ఆస్పత్రికి వచ్చారన్నారు. ఆర్థోపెడిక్ నిపుణులు జాస్తి నవీన్‌చంద్రతో కలిసి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి కండరాలకు రక్తప్రసరణను పునరుద్ధరించామని చెప్పారు. రెండు వారాల్లో సాధారణంగా నడవ గలిగాడని డాక్టర్ ప్రతాప్ వివరించారు.

సెక్యూరిటీ సంస్థకు రూ. 25 వేల జరిమానా

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రద్దీ సమయంలో భక్తులకు ఇబ్బంది కలుగుతున్నా ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయకపోవడంపై దుర్గగుడి ఈవో శీనానాయక్ గురువారం ఎజైల్ సెక్యూరిటీ సర్వీసెస్‌కు రూ. 25 వేలు జరిమానా విధించారు. వీకెండ్, రద్దీ సమయాల్లో వాహనాల పార్కింగ్, భక్తుల నడిచే మార్గంలో వాహనాల పార్కింగ్ ఇష్టానుసారంగా చేస్తున్నా సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణమని నోటీసులో పేర్కొన్నారు. నోటీసు అందుకున్న మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు.